RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ సోమవారం 16.02.2026 సంపుటి : 03 సంచిక :73 పేజీలు : 08 వెల : రూ.5

తెలుగు దినపత్రిక

Karimnagar Monday 16.02.2026 Volume: 03 Issue 73 Pages 08 Cost 5/



# పాక్ చిత్తు..చిత్తు

## శివమెత్తిన ఇషాన్..వరల్డ్‌కప్‌లో 8-1తో పాక్‌పై టీమిండియా పైచేయి

5లో..

పొట్టి ప్రపంచకప్‌లో తమకు తిరు గులేదని చాటుతూ పాకిస్థాన్‌ను మట్టికరిపించింది భారత్. ప్రేమదా స మైదానంలో ఓపెనర్ ఇషాన్ కిషన్(77) అర్ధ శతకంతో శివమె త్తగా.. బౌలింగ్ దళం విజృంభణతో టీమిండియా లీగ్ దశలో హ్యాట్రిక్ కొట్టింది.

# మేం సేవకులం

## పాలకులం కాదని ఏనాడో చెప్పా



4లో..

- నేనే రాజు.. నేనే మంత్రి'ని మరోలా అర్థం చేసుకున్నారు
- ముఖ్యమంత్రినీ నేనే.. మునిసిపల్ మంత్రినీ నేనే..
- ఎన్నికల్లో గెలుపోటములకు బాధ్యత నాదేనని అర్థం
- పేదలను పరిపాలనలో భాగస్వాములను చేశాం
- దళితుడిని అధ్యక్షా అని మైక్ అడిగేలా పైన కూర్చోబెట్టాం
- ప్రభుత్వంలో 30 శాతం పదవులు ఎస్సీలకు ఇచ్చాం
- నల్లమలలో 20 ఎకరాల్లో సేవాలాల్ పుణ్యక్షేత్రం
- వచ్చే ఏడాది జయంతి వేడుకలు అక్కడే నిర్వహిస్తాం
- ప్రతి తండాకు బీటీ రోడ్లు, సోలార్ పంపుసెట్లు మంజూరు
- సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

'నేనే రాజు.. నేనే మంత్రి' అని తాను చెప్పిన విషయాన్ని కొందరు వేరే విధంగా అర్థం చేసుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తాము పాలకులం కాదని, సేవకులమని, ఈ విషయాన్ని తాను ఏనాడో చెప్పానని తెలిపారు. తాను పాలకుడిగా ఎప్పుడూ ప్రవర్తించలేదని, సేవ చేయడానికే ప్రజలు తనకు అవకాశం ఇచ్చారని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో జరిగిన సంత్ సేవాలాల్ 287వ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని మాట్లాడారు.

## రేపు ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

- పుట్టిన రోజును అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలి
- పార్టీ నాయకులు, శ్రేణులకు మాజీ మంత్రి తలసాని పిలుపు




**హైదరాబాద్, ఫిబ్రవరి 15 :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.. రాష్ట్ర ప్రజల కరెంట్, నీళ్ల గోస తీర్చిన మహానాయకుడు అని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కొనియాడారు. వృద్ధులకు ఆసరా పింఛన్లు, పేదింటి ఆడబిడ్డ పెండ్లి కోసం కల్యాణలక్ష్మి/షాదీముబారక్ పథకల అందజేతతో పాటు గురుకులాలను అద్భుతంగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. సాగు, తాగునీటి ఇబ్బందులు తీర్చిన గొప్ప నాయకుడని చెప్పారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం మీడియా సమావేశంలో తలసాని మాట్లాడారు. మంగళవారం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ భవన్‌లో కేక్ కట్ చేసి, కేసీఆర్ జన్మదిన వేడుకులు జరుపుతామని తెలిపారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.కేసీఆర్ చేసిన ఉద్యమాలు, అభివృద్ధి పనుల చిత్రపటాల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి హరీశ్‌రావు, శాసనమండలిలో ప్రతిపక్ష నేత , ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ముఖ్య నేతలు పాల్గొంటారని తెలిపారు. కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలకు పెద్ద ఎత్తున హాజరుకావాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. జిల్లాల వారీగా నేతలందరూ కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించడంతో పాటు ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయాలని కోరారు. అనంతరం తెలం గాణ భవన్‌లో వేడుకల ఏర్పాట్లను పార్టీ ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి తలసాని పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పల్లె రవికుమార్, కిశోర్‌గౌడ్, ముఠా జయసింహ పాల్గొన్నారు.

# నేడు 'పుర'పాలకవర్గాల కొలువు

- 11 గంటలకు సభ్యుల ప్రమాణం
- 12:30 గంటలకు మేయర్ ఛైర్‌పర్సన్లు ..
- ఆ తర్వాత డిప్యూటీ మేయర్, వైఎస్ ఛైర్‌పర్సన్ల ఎన్నిక
- చేతులెత్తే విధానంలో ఎన్నిక
- పార్టీ అభ్యర్థులకు విప్ జారీ
- ఎక్స్ అఫీషియో సభ్యులు కీలకం

6లో..



రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో నే డు (సోమవారం) కొత్త పాలకవ ర్గాలు కొలువుదీరనున్నాయి. ఇందు కు రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ అన్ని ఏర్పాట్లు చేసింది. ఆయా జిల్లాల కలెక్టర్ల పర్యవేక్షణలో ఈ ప్రక్రియను పూర్తిచేసేందుకు రంగం సిద్ధమైంది. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరే షన్ల ఎన్నిక ఫలి తాలు 13న ఫలి తాలు ప్రకటించిన విషయం తెలి సిందే. ఈ మేరకు నేడు (సోమ వారం) 11 గంటలకు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు, కార్పొరేటర్లతో సంబంధిత కమిషనర్లు ప్రమాణం చేయిస్తారు.

# శివాలయాల్లో శివనామస్మరణ

- ఘనంగా మహా శివరాత్రి వేడుకలు -



లోపలి పేజీల్లో..

## మార్చి 9న ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మాన చర్చ



**న్యూఢిల్లీ:** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను పదవి నుంచి తొలగించేందుకు విపక్షాలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై పార్లమెంట్ మలి విడత బడ్జెట్ సమావేశాల తొలి రోజైన మార్చి 9న చర్చ, ఓటింగ్ ఉంటాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజు ఆదివారం తెలిపారు.నిబంధనల ప్రకారం సమావేశాల తొలి రోజే ఈ చర్చ చేపట్టాలని చెప్పారు. ఓం బిర్లా స్పష్టంగా విపక్షాలపై పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని విపక్షం ఆరోపించి ఆయనపై అవిశ్వాసానికి నోటీస్ ఇవ్వడంతో చర్చ అనివార్యమైంది.

## లొంగిపోయిన మావోయిస్టులకు తక్షణ ఆర్థిక సాయం, పునరావాసం

### తెలంగాణ డీజీపీ పిలుపు




అండర్‌గ్రౌండ్‌లో ఉన్న మావోయిస్టులు వెంటనే లొంగిపోయి జనజీవన స్రవంతి లోకి రావాలని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పిలుపును మరోసారి తెలంగాణ పోలీసులు పునరుద్ఘాటించారు. గత రెండు సంవత్సరాల్లో 588 మంది మావోయిస్టులు లొంగిపోయారని, తెలంగాణాకి చెందిన 15 మంది క్యాడర్‌లు కూడా లొంగిపోవాలని డీజీపీ పిలుపునిచ్చారు. జన జీవన స్రవంతిలోకి వచ్చి శాంతి మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. లొంగిపోతే తక్షణ ఆర్థిక సాయం, పునరావాసం కల్పిస్తామని మావోలకు డీజీపీ హామీ ఇచ్చారు. కుటుంబాలతో గౌరవప్రదమైన జీవితం గడపాలని సూచించారు. సమాజంలో గౌరవంతో, స్వేచ్ఛతో, కుటుంబ సభ్యులతో కలిసి జీవించేందుకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తామని ప్రభుత్వం తరపున హామీ ఇచ్చారు. శాంతి, అభివృద్ధి, సమాజ నిర్మాణం కోసం అందరూ కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అండర్‌గ్రౌండ్ జీవితం విడిచి కుటుంబాలతో కలసి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపు ఇచ్చారు.

# శివనామస్మరణతో వేలాల

**- ఘనంగా**

**మహా శివరాత్రి వేడుకలు -**

**జనోదయ మందమర్రి ఫిబ్రవరి15:**

చెన్నూరు నియోజకవర్గంలోని జైపూర్ మండలం వేలాల గ్రామంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామంతో పాటు, గ్రామ సమీపంలోని గుట్టపై వెలసిన గట్టు మల్లన్న ఆలయ ప్రాంతం శివ నామస్మరణ మారుమోగాయి. గ్రామంలో రెండు రోజుల పాటు జరిగే మహాశివరాత్రి జాతరలో భాగంగా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని తొలి రోజు ఆదివారం గ్రామ సమీపంలోని గుట్టపై వెలసిన గట్టు మల్లన్న స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామంలోని పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి అనంతరం కాలినడకన గుట్టపై ఉన్న గట్టు మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుండి స్వామి వారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి రాగా ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. గట్టు మల్లన్న స్వామి గుట్టపై నున్న దోనలో స్వయంబుగా వెలసి భక్తులతో పూజలందుకుంటున్నాడు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు సమర్పిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. గుట్టపై దోనలో స్వయంబుగా వెలసిన స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండే కాకుండా , ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి వరంగల్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుండి అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించి బోనాలు, పట్నాలు చెల్లించుకున్నారు .ఒగ్గు పూజారుల డమరుక నాదాల నడుమ వేలాలగుట్ట పైనున్న గట్టు మల్లన్న క్షేత్రం భక్తుల శివ నామస్మరణతో మారు మోగింది. తొలి రోజు జరిగిన జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలి రాగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయగా, పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు త్రాగునీరు, అల్పాహారం, పండ్లు పంపిణీ చేశాయి. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జైపూర్ ఏసిపి శ్రీరాంపూర్ సిఐ బారి బందోబస్తు ఏర్పాటు చేశారు.

**పూజలు నిర్వహించిన మంత్రి వివేక్**

వేలాల గట్టు మల్లన్న స్వామిని , రాష్ట్ర కార్మిక గనుల శాఖ మంత్రి జి వివేక్ వెంకటస్వామి కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుట్ట కింద నుండి గుట్ట పై నున్న ఆలయం వరకు కాలినడకన ఆలయానికి చేరుకొన్నారు. ఆలయ దర్శనానికి వచ్చిన ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఒగ్గ డోలు చప్పుళ్ళ నడుమ పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధానంలో మహాశివరాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ మల్లికార్జున స్వామి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. అనేక ఏళ్లుగా గుట్ట పైనున్న ఆ ఆలయానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారని అటవీశాఖ





అనుమతులు లేకపోవడంతో రోడ్డు సౌకర్యం ఇబ్బందిగా మారిందన్నారు. త్వరలోనే అటవీ శాఖ అధికారులతో చర్చించి రహదారి సౌకర్యం కల్పనకు కృషి చేస్తానన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా తాగునీరు, మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. జాతర ప్రాంగణంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రతినెల గిరి ప్రదర్శన ప్రారంభించడం జరిగిందని, రానున్న రోజుల్లో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తానన్నారు.

# వైభవంగా బుగ్గ జాతర

**భారీగా పోటెత్తిన భక్తజనం**

**దర్శనం కోసం క్యూ లైన్‌లో గంటల తరబడి ఇబ్బంది**

**మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే వినోద్, ప్రముఖులు**

**జనోదయ, బెల్లంపల్లి, ఫిబ్రవరి 15:**

బెల్లంపల్లి మండలంలోని కన్నాల శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం మహా శివరాత్రి జాతర వైభవంగా జరిగింది. ఉదయం 4 గంటల నుండే భక్తులు బుగ్గకు చేరుకొని గర్భగుడిలో మొక్కులు ప్రారంభించారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, చత్తీస్ ఘడ్ ప్రాంతాల నుండి ఈసారి భక్తులు తరలి వచ్చారు. భక్తుల కోసం బెల్లంపల్లి కాంట,పాత బస్టాండ్ ప్రాంతాల నుండి ఈ సారి టిజిఎస్ ఆర్టీసీ 10 స్పెషల్ బస్సులను జాతరకు కేటాయించింది. ప్రైవేటు వాహనాలతో పాటు ఆటోలలో కూడా పెద్ద సంఖ్యలో భక్తులు జాతరకు తరలి వచ్చారు. దేవస్థానం అర్చకులు శ్రీరాంభట్ల వేణుగోపాల శాస్త్రి, సతీష్ శర్మ ల వేదమంత్రోచ్ఛరణల మధ్య గర్భగుడిలో ప్రత్యేక అర్చనలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ బుగ్గ గర్భగుడిలో శివలింగానికి అభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వినోద్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు కారుకూరి రాంచందర్, ముచ్చర్ల మల్లయ్య, నాతరి స్వామి, బత్తుల రవి, పలువురు ప్రముఖులు , అధికారులు రాజ రాజేశ్వరున్ని దర్శించుకుని ఘనంగా మొక్కులు చెల్లించుకున్నారు. ఈసారి భక్తుల రద్దీ విపరీతంగా పెరగడంతో దర్శనం కోసం భక్తులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి తప్పలేదు. రూ 100 సులభ దర్శనం, రూ 50 ప్రత్యేక దర్శనం కోసం ఏర్పాటుచేసిన క్యూ లైన్లలో కూడా రద్దీ పెరగడంతో దర్శనం కోసం ఇబ్బందులు తప్పలేదు. ఇక సాధారణ క్యూ లైన్ లలో భక్తులు అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం వరకు విపరీతమైన రద్దీ పెరగడంతో బెల్లంపల్లి వైపు గుట్ట పైభాగం వరకు, కాసిపేట వైపు పోచమ్మ ఆలయం వరకు భక్తులు క్యూలో దర్శనం కోసం అవస్థలు పడ్డారు.

వీరాంజనేయ దేవాలయం, నాగులమ్మ ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి భక్తులు గర్భగుడిలోని శివలింగాన్ని దర్శించుకున్నారు. తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్, ఎండోమెంట్ ఈవో బాపురెడ్డి,ఉత్సవ కమిటీ చైర్మన్ దూడం మహేష్, మాజీ చైర్మన్ మంద అనిత, మాసాడి శ్రీదేవి శ్రీరాములు, కన్నాల, అంకుశం సర్పంచులు నాతరి మల్లమ్మ, బొంతల అరుణ చంద్రమోహన్, ఉప సర్పంచ్ కొప్పుల భానుచందర్, ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ది రాజేందర్, సుంకరి రాజేశం, పుష్ప, మీస రమేష్, చిలువేరు అరవింద్, మంద ఉదయ వికాస్, నాయకులు నాతరి మూర్తి, శంకర్ లు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జాతర ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు భక్తులకు అల్పాహారం, అన్నదానం, త్రాగునీరు, మజ్జిగ, పండ్లు, రస్నా పంపిణీ చేశారు.బెల్లంపల్లి ఏసిపి ఏ .రవి కుమార్ పర్యవేక్షణలో బెల్లంపల్లి రూరల్, బెల్లంపల్లి వన్ టౌన్, తాండూర్ సీఐలు సిహెచ్ హనూక్, శ్రీనివాసరావు, నీలాల దేవయ్యలు పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

**శివాలయాలకు భక్తుల తాకిడి**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం బెల్లంపల్లి పరిసర ప్రాంతాల్లోని శివాలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. బెల్లంపల్లి శివాలయం, చంద్రవెల్లి సోమేశ్వరాలయం, లింగాపూర్ త్రిలింగేశ్వరాలయం, కన్నాల పంచముఖి హనుమాన్ లింగేశ్వరాలయాలు భక్తులతో రద్దీగా మారాయి. హనుమాన్ బస్తీలోని హనుమాన్ దేవాలయం, సరస్వతి శిశు మందిర్ ప్రాంతంలోని శివాలయం, కొత్త బస్టాండ్ ప్రాంతంలోని విశ్వేశ్వరాలయం,జ్యోతిర్లింగాలు కలిగిన దుర్గామాత ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి.







# పండుగ పూట విషాదం

**-అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం -**





**జనోదయ, మందమర్రి ఫిబ్రవరి 15:**

మహాశివరాత్రి పర్వదినం రోజున పట్టణంలో విషాదం చోటుచేసుకుంది. పటణంలోని శ్రీపతి నగర్‌లో నివాసం ఉండే సింగరేణి ఏరియా వర్క్ షాప్‌లో విధులు నిర్వహించే ఎలక్ట్రీషియన్ ఉద్యోగి తుమ్మ సదానందం (సాధు) ఇల్లు అగ్నికి ఆహుతయింది. ఆదివారం ఉదయం ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ మూలంగా మంటలు చెలరేగడంతో క్షణాల్లో మంటలు ఇల్లంతా వ్యాపించి ఇంట్లోని విలువైన వస్తువులు, కలప సామాగ్రి అగ్నికి ఆహుతైంది. బాధితుడు సదానందం తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం షిఫ్ట్ విధులకు హాజరయ్యేందుకు వెళ్లగా ఇంట్లో తల్లి, భార్య ఉన్నారని తెలిపారు. ఒక్కసారిగా ఇంట్లో నుండి దట్టమైన పొగలు వస్తుండటంతో గమనించిన స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకుని వచ్చేసరికి ఇంట్లోని విలువైన వస్తువులు కాలి బూడిదయ్యాయని బాధితుడు విలపించారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని విలువైన వస్తువులతో పాటు నగదు, బంగారం, టేకు కలప పూర్తిగా కాలిపోయాయని, సుమారు 20 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు. కాగా ఘటనా స్థలాన్ని పట్టణ ఎస్సై గోపతి నరేష్ సందర్శించి ప్రమాదం వివరాలు సేకరించారు.

**పలువురు పరామర్శ...**

అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన తుమ్మ సదానందం కుటుంబాన్ని పట్టణంలోని సీనియర్ కాంగ్రెస్ నాయకులు సోత్కు సుదర్శన్ పరామర్శించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదం జరిగిన తీరును బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం బాధాకరమని బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. అగ్ని ప్రమాద ఘటనను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ దృష్టికి తీసుకువెళ్లి బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా తగిన న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కడలి శ్రీనివాస్ రావు, మల్యాల రమేష్‌లు పాల్గొన్నారు.

**పద్మశాలి సంఘం.....**

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని పట్టణ పద్మశాలి సంఘం నాయకులు పరామర్శించారు. అగ్నిప్రమాదంలో సర్వసం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# మియాపూర్‌లో ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి, మహా శివరాత్రి వేడుకలు

**జనోదయ :శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 15:**

బంజారా ఆరాధ్య దైవం సంతు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి మహోత్సవాల సందర్భంగా మియాపూర్ ఎంఏ నగర్ సేవాలాల్ అసోసియేషన్ మియాపూర్ నడిగడ్డ తండా సేవాలాల్ అసోసియేషన్ ఆహ్వానం మేరకు నిర్వహించిన కార్యక్రమాలలో శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ శ్రీ జగదీశ్వర్ గౌడ్, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ తమ బృందంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంత్ సేవాలాల్ మహారాజ్ సేవా తత్వం, సమానత్వ భావన, సామాజిక న్యాయం పట్ల ఆయన చూపిన మార్గాన్ని స్మరించుకున్నారు. సమాజ అభ్యున్నతి దిశగా ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాలకు ఆహ్వానించి సత్కరించిన సేవాలాల్ అసోసియేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పవిత్రమైన మహాశివరాత్రి సందర్భంగా మియాపూర్ జేపీ నగర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి కార్యక్రమాలలోను వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భగవాన్ పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. మహా శివరాత్రి ఆధ్యాత్మిక చైతన్యానికి, నియమ నిష్ఠలకు, ధార్మిక విలువలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొంటూ,





సమాజంలో ఐక్యత, సౌహార్దత, సేవా భావం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాలలో , నాయకులు వీరేందర్ గౌడ్, మన్నేపల్లి సాంబశివరావు, రవి కుమార్, రవీందర్ రెడ్డి, వంశీ, ప్రవీణ్, సాయి నిఖిల్, రత్నాచారి, నాగసాయి తదితరులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొని మహాదేవుని ఆశీస్సులు సమస్త ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

# మహాప్రస్థానంలో ఘనంగా శివరాత్రి వేడుకలు



**జనోదయ, మందమర్రి ఫిబ్రవరి 15:**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోదావరి తీరంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాప్రస్థానం లో మహాశివరాత్రి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించు కొని మాజీ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ మహా రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి పుణ్య స్నానాలకి వచ్చే భక్తుల కోసం అల్పాహారం, ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరికీ శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. పరమ శివుని అనుగ్రహంతో ప్రజలందరికీ ఆరోగ్యం, ఆయుష్షు, ఐశ్వర్యం, శాంతి కలగాలని ఆకాంక్షించారు. పవిత్రమైన మహాశివరాత్రి ప్రజల జీవితంలో ఆనందం, ఆధ్యాత్మిక శాంతి, విజయాలను నింపాలని ప్రార్థించారు.

# వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



**జనోదయ, బెల్లంపల్లి, ఫిబ్రవరి 15:**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం గోవింద మాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. విశ్వశాంతి, లోక కల్యాణార్థం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం పెద్దలు,స్వర్ణకార సంఘ కార్పెంటర్ సంఘం, మనుమయ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# నాగదేవత ఆలయ నిర్మాణం కోసం ముందుకు వచ్చిన దాత

**జనోదయ, హుజురాబాద్ ఫిబ్రవరి 15**



హుజురాబాద్ మండలం పెద్ద పాపయ్య పల్లె లో గత 23 సంవత్సరాల క్రితం ఆగిపోయిన నాగ దేవత ఆలయాని మహా శివరాత్రి రోజున ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించిన చల్లూరి రాజయ్య... దాదాపు 23 సంవత్సరాల క్రితం నుండి నాగదేవత ఆలయ నిర్మాణం చేపట్టాలని పెద్ద పాపయ్యపల్లె గ్రామ ప్రజలు కోరగా ఎవరు పట్టించుకున్న పాపాన పోలేదు. నాగ పంచమి పండుగ రోజున పాలు పోయడానికి ఊరి ప్రజలు హుజురాబాద్ మరియు పక్కన గ్రామాలకు వెళ్లి పాలు పోసి వచ్చేవారు. ఎంత మందిని కలిసి ప్రజలు నాగమ్మ ఆలయ నిర్మాణం పూర్తి చేయాలని అడిగిన ఎవరు ముందుకు రాకపోగా, ఎన్నికలలో వాగ్దానాలు చేసి మరిచి పోయిన వారు ఉన్నారు. కానీ నా గ్రామానికి నేను అభివృద్ధి చేయాలని ముందుకు వచ్చి ఆలయ నిర్మాణంలో భాగస్వామి అయిన చల్లూరి రాజయ్యను గ్రామ ప్రజలు అభినందిస్తున్నారు. ఆలయ నిర్మాణ దాత అయిన చల్లూరి రాజయ్య మాట్లాడుతూ నేను రెండు సంవత్సరాల క్రితం పెద్ద మనుషులను కలిసి ఆలయ నిర్మాణం చేపట్టాలని అడగగా ఎవరు ముందుకు రాలేదు. సరే అని నా వంతుగా నేను ఆలయ నిర్మాణం చేపడతానని చెప్పి ముందుకు రావడం జరిగింది. ఇంకా ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణం పూర్తి చేసి గ్రామ అభివృద్ధికి పాటు పడాలని కోరారు..

# మేం సేవకులం

## పాలకులం కాదని ఏనాడో చెప్పా



**నేనే రాజు.. నేనే మంత్రి'ని మరోలా అర్థం చేసుకున్నారు**
**ముఖ్యమంత్రినీ నేనే.. మునిసిపల్ మంత్రినీ నేనే..**
**ఎన్నికల్లో గెలుపోటములకు బాధ్యత నాదేనని అర్థం**
**పేదలను పరిపాలనలో భాగస్వాములను చేశాం**
**దళితుడిని అధ్యక్షా అని మైక్ అడిగేలా పైన కూర్చోబెట్టాం**
**ప్రభుత్వంలో 30 శాతం పదవులు ఎస్సీలకు ఇచ్చాం**
**నల్లమలలో 20 ఎకరాల్లో సేవాలాల్ పుణ్యక్షేత్రం**
**వచ్చే ఏడాది జయంతి వేడుకలు అక్కడే నిర్వహిస్తాం**
**ప్రతి తండాకు బీటీ రోడ్లు, సోలార్ పంపుసెట్లు మంజూరు**
**సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి**

'నేనే రాజు.. నేనే మంత్రి' అని తాను చెప్పిన విషయాన్ని కొందరు వేరే విధంగా అర్థం చేసుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తాము పాలకులం కాదని, సేవకులమని, ఈ విషయాన్ని తాను ఏనాడో చెప్పానని తెలిపారు. తాను పాలకుడిగా ఎప్పుడూ ప్రవర్తించలేదని, సేవ చేయడానికే ప్రజలు తనకు అవకాశం ఇచ్చారని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో జరిగిన సంత్ సేవాలాల్ 287వ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని మాట్లాడారు.

**హైదరాబాద్, ఫిబ్రవరి 15 :** 'నేనే రాజు.. నేనే మంత్రి' అని తాను చెప్పిన విషయాన్ని కొందరు వేరే విధంగా అర్థం చేసుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తాము పాలకులం కాదని, సేవకులమని, ఈ విషయాన్ని తాను ఏనాడో చెప్పానని తెలిపారు. తాను పాలకుడిగా ఎప్పుడూ ప్రవర్తించలేదని, సేవ చేయడానికే ప్రజలు తనకు అవకాశం ఇచ్చారని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో జరిగిన సంత్ సేవాలాల్ 287వ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని మాట్లాడారు. "ముఖ్యమంత్రి నేనే.. మునిసిపల్ మంత్రిని నేనే. అందుకే ఎన్నికల్లో గెలుపోటములకు నాదే బాధ్యత అని చెప్పాను. మునిసిపల్ ఎన్నికల్లో 90శాతం ఫలితాలు మాకు అనుకూలంగా వచ్చాయి. ఇవి మా పనితీరుకు గీటురాయి. ఈ విషయం కొందరికి అర్థం కాదు. అర్థమైనా స్వీకరించే గొప్ప మనసు వాళ్లకు లేదు. అందుకే సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. పేదలు పాలించకూడదు.. కేవలం మా పిల్లలే రాజ్యాలు ఏలాలి అన్నది కొందరి విధానం. కానీ, నేను పరిపాలనలో పేదలను భాగస్వాములను చేశాను" అని సీఎం రేవంత్ అన్నారు. తనకు అవకాశమిచ్చిన వర్గాలకు సేవ చేయాలన్నదే తన ప్రయత్నమన్నారు. 40 ఏళ్లుగా జటిలంగా మారిన ఎస్సీ వర్గీకరణ సమస్యను తాను పరిష్కరించానని తెలిపారు. ఎన్నికల్లో గెలిస్తే విర్రవీగడం, ఓడిపోతే కుంగిపోవడం తనకు తెలియదన్నారు. 20 ఏళ్లుగా ప్రజల మధ్యే ఉన్నానని, వచ్చే 20 ఏళ్లు కూడా పేద ల కోసమే పనిచేస్తానని ప్రకటించారు. గతం లో ఒక నాయకుడు దళితుడిని ముఖ్యమంత్రి ని చేస్తానని చెప్పి మోసం చేశారని సీఎం రేవంత్ అన్నారు. కానీ, తాను దళితుడిని 'అధ్యక్షా' అని పిలిచి మైక్ అడిగేలా స్పీకర్ హోదాలో పైన కూర్చోబెట్టానని గుర్తు చేశారు. 15శాతం ఉన్న ఎస్సీలకు ప్రభుత్వంలో 30 శాతం పదవులు ఇచ్చామని, నలుగురు మంత్రులు, స్పీకర్ పదవి ఇచ్చి సామాజిక మార్పును తీసుకొచ్చామని తెలిపారు. ఇది ప్రజాస్వామ్యం గొప్పతనమని, అంబేద్కర్ ఇచ్చిన ఆయుధమని పేర్కొన్నారు. మిడ్జిల్‌లో తాను జడ్పీటీసీగా పోటీ చేసినప్పుడు తండాల్లోని యువకులు తన విజయంలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. తన రాజకీయ ప్రస్థానంలో లంబాడీ సోదరులు అండగా నిలిచార ని, నేడు సీఎం హోదాలో ఉండడం వెనుక వారి అండదండలు ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో లంబాడీల పాత్ర ఎనలేనిదని,అన్నారు. లంబాడీల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ చిరస్మరణీయ క్షేత్రాన్ని నాగర్ కర్నూల్ జిల్లాలోని నల్లమల అడవుల్లో ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇందుకోసం అచ్చంపేట అటవీ ప్రాంతంలో 20 ఎకరాల భూమిని ఇప్పటికే సేకరించినట్లు తెలిపారు. ఏడాదిలోపు దేవాలయ నిర్మాణాన్ని పూర్తిచేసి వచ్చేసారి జయంతి వేడుకలను అక్కడే నిర్వహిస్తామన్నారు. సంత్ సేవాలాల్ లంబాడీ సమాజాన్ని సన్మార్గంలో నడిపించి అభ్యున్నతి దిశగా తీసుకెళ్లిన మహనీయుడని, ఆయన బోధనలు నైతిక విలువలు, సేవాభావం, సామాజిక ఐక్యతను బలపరిచాయని అన్నారు. గిరిజనులు, తండాల అభివృద్ధి కోసం సీఎం పలు వరాలు ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రతి తండాకు బీటీ రోడ్లు, సోలార్ పంపుసెట్లు, పాఠశాల భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలు, తాగునీరు, విద్యుత్తు వంటి మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ నీరు అందనిచోట ట్యాంకులు నిర్మించి సోలార్ పంపుసెట్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. గిరిజన విద్యార్థుల కాస్మెటిక్ చార్జీలను 200 శాతం పెంచినట్లు గుర్తుచేశారు. చదువే అన్ని హోదాలను తెస్తుందని, విద్యార్థులు కష్టపడి చదివి తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. 100 నియోజకవర్గాల్లో రూ.20 వేల కోట్లతో ఒక్కో చోట 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నామన్నారు. గిరిజన విద్యార్థులకు స్ఫూర్తి కలగాలనే ఆ వర్గానికి చెందిన అధికారులకు కీలక పోస్టింగ్‌లు ఇచ్చానని, గ్రూప్-1 ఫలితాల్లో 87% ఎస్సీ, ఎస్టీ, బీసీలే ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రాంచందర్ నాయక్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్, అదనపు సంచాలకులు సర్వేశ్వర్‌రెడ్డి, సముజ్వల పాల్గొన్నారు.

### భక్త మార్కండేయ స్వామి ఆలయంలో

## ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాలు

**జనోదయ: డి. హీరేహాళ్**
**(రాయదుర్గం)ఫిబ్రవరి 15**

రాయదుర్గం పట్టణంలో శ్రీ భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెల్లవారుజాము నుంచే స్వామి వారి మూలవిరాట్‌కు కుంకుమార్చన, పంచామృతాభిషేకం, బిల్వపత్రాభిషేకం, రుద్రాభిషేకం వంటి విశేష పూజలు పురోహితులు నిర్వహించారు. రంగు రంగుల పూలతో ఆలయాన్ని అలం కరించి భక్తి వాతావరణాన్ని సృష్టించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వా మి



వారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఆలయ ప్రాంగణం అంతా "ఓం నమశ్శివాయ" అంటూ శివనామ స్మరణతో మార్మోగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు. ఆలయ సిబ్బంది అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

### వేలాల జాతరలోవిషాదం

### -గుండె పోటుతో భక్తుని మృతి -

**జనోదయ, మందమర్రి ఫిబ్రవరి 15:**

జైపూర్ మండలం వేలాల గ్రామంలోని గుట్టపై కొలువున్న గట్టు మల్లన్న సన్నిధిలో మహా శివరాత్రి జాతరలో విషాదం చోటుచేసుకుంది. జాతర సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు నస్పూర్‌కు చెందిన బింగి రాజేందర్ (45) కుటుంబ సమేతంగా గట్టు మల్లన్నను దర్శించు కోవడానికి గుట్ట పైకి కాలినడకన వెళ్తుండగా ఒక్క సారిగా గుండె నొప్పితో కుప్ప కూలి అక్కడికక్కడే మృతి చెందాడు. దైవ దర్శనానికి వచ్చి కానరాని లోకాలకు వెళ్లిపోయా



రని కుటుంబ సభ్యులు విలపించిన తీరు పలువురిని కలచి వేసింది.

### కన్నుల పండువగా

## శివపార్వతుల కళ్యాణం



**జనోదయ, బెల్లంపల్లి, ఫిబ్రవరి 15:**

బెల్లంపల్లి మండలంలోని లింగాపూర్ గ్రామంలో గల త్రిలింగేశ్వర దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం రాత్రి శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని అర్చకులు కన్నుల పండుగగా నిర్వహించారు. దేవస్థాన నిర్మాణ దాత రాగం శెట్టి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు ఘనంగా పల్లకి సేవలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సమయంలో గ్రామస్తుల శివనామ స్మరణలతో గ్రామమంతా మార్మోగింది. పల్లకి సేవకు మహిళలు మంగళ హారతులు పట్టారు. గ్రామంలో చిన్న పెద్ద తేడా లేకుండా ఆధ్యాత్మిక భావాన్ని చాటారు. భక్తిశ్రద్ధలతో త్రిలిం గేశ్వరున్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అత్యంత రమణీయంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవ ఘట్టాన్ని నిర్వహించారు.

# శివమెత్తిన ఇషాన్..

## వరల్డ్‌కప్‌లో 8-1తో పాక్‌పై టీమిండియా పైచేయి

పొట్టి ప్రపంచకప్‌లో తమకు తిరుగులేదని చాటుతూ పాకిస్థాన్‌ను మట్టికరిపించింది భారత్. ప్రేమదాస మైదానంలో ఓపెనర్ ఇషాన్ కిషన్(77) అర్ధ శతకంతో శివమెత్తగా.. బౌలింగ్ దళం విజృంభణతో టీమిండియా లీగ్ దశలో హ్యాట్రిక్ కొట్టింది. ఛేదనలో బుమ్రా(2-17), అక్షర్ పటేల్(2-29) కీలక వికెటతో పాక్‌ను పడగొట్టారు. పవర్ ప్లేలోనే నలుగురు ఔటవ్వగా.. ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగని పాక్‌ను భారత్ ఎనిమిదోసారి చిత్తు చేసింది. ఇకపై పాక్‌తో 'గ్రేటెస్ట్ రైవల్రీ అనేది ఉత్తమాటే' అని చాటింది.ప్రపంచకప్ వంటి మెగా టోర్నీలో భారత్ అంటే జడుసుకునే పాకిస్థాన్ మరోసారి మ్యాచ్‌ను అప్పగించేసింది. ఆసియా కప్‌లో టీమిండియా చేతిలో చావుదెబ్బతిన్న పాక్.. పొట్టి కప్‌లోనూ 'మా వల్ల కాదని' చేతులెత్తేసింది. మ్యాచ్‌కు ముందు 'మేము అత్యుత్తమ జట్టుతోతలపడాలని అనకుంటున్నా'మని చెప్పిన పాక్ సారథి.. అత్యుత్తమ ఆటను మాత్రం కనబరచడంలో విఫలమయ్యాడు. ఫలితంగా.. ప్రేమదాస స్టేడియంలో భారత్ నిర్దేశించిన భారీ ఛేదనలో దాయది 114 పరుగులకే కుప్పకూలి ఘోర పరాభవం మూటగట్టుకుంది.చరిత్రను మార్చలేం.. కానీ, గొప్పగా ఆడుతామని బీరాలు పలికిన పాకిస్థాన్ జట్టు ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. మొదటి ఓవర్లోనే ఓపెనర్ సహిబ్జద ఫర్హాన్(0)ను హార్దిక్ పాండ్యా(1-8) వెనక్కి పంపగా.. జస్ప్రీత్ బుమ్రా (2-17) ఒకే ఓవర్లో ఇద్దరని పెవిలియన్ పంపి దాయాదికి దిమ్మతిరిగే షాకిచ్చాడు. ఐదో ఓవర్లో రెండు ఫోర్లు ఇచ్చిన అక్షర్ పటేల్(2-29) సూపర్ డెలివరీతో బాబర్ ఆజాం (5)ను బౌల్డ్ చేసి పాక్‌ను ఒత్తిడిలో పడేశాడు. అంతే.. 34కే పాక్ నాలుగో వికెట్ కోల్పోయింది.పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లు పడిన వేళ పాక్ జట్టును ఆదుకునేందుకు ఉస్మాన్ ఖాన్(44) గట్టిగానే ప్రయత్నించాడు. స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొంటూ బౌండరీలు బాదేస్తున్న అతడిని అక్షర్ బోల్తా కొట్టించగా.. ఇషాన్ రెప్పపాటులో స్టంపింగ్ చేశాడు. ఆ వికెట్‌లో పాక్ ఆశలు ఆవిరయ్యాయి.కాసేపటికే కుల్దీప్ వేసినలో ఫుల్‌టాస్‌కు షాట్ ఆడిన నవాజ్(4) శివం దూబేకు క్యాచ్ ఇచ్చాడు.. పార్ట్ టైమ్ స్పిన్నర్ తిలక్ ఓవర్లో షాదాబ్ ఖాన్(14) దూబేకే చిక్కడంతో పాక్ ఓటమి ఖాయమైంది. వరుణ్ చక్రవర్తి(2-17) ఒకే ఓవర్లో ఫహీం అష్రఫ్(10), అబ్రార్ అహ్మద్(0)ను ఔట్ చేసి హ్యాట్రిక్‌పై నిలిచాడు. షాహీన్ అఫ్రిది(23 నాటౌట్) కాసేపు పోరాడినా.. ఉస్మాన్ తారీఖ్()ను బౌల్డ్ చేసిన పాండ్యా పాక్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. 61 పరుగుల తేడాతో గెలుపొందింది టీమిండియా. పాకిస్థాన్ బౌలర్లను ఉతికేస్తూ భారత ఓపెనర్ ఇషాన్ కిషన్ (77) పాకిస్థాన్‌పై రెచ్చిపోయాడు. అభిషేక్ శర్మ(0) తొలి ఓవర్లోనే ఔటైనా.. విధ్వంసక ఆటతో విరుచుకుపడిన ఇషాన్ బౌండరీలతో శివాలెత్తిపోయాడు. ఒక్క పరుగుకే డేంజరస్ అభిషేక్ వికెట్ పడడంతో సంబురాల్లో మునిగిన పాక్ జట్టుకు షాకిస్తూ ఇషాన్ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. మెరుపు అర్ధ శతకంతో శుభారంభమిచ్చిన ఇషాన్ ఔటయ్యాక కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(32), తిలక్ వర్మ (25)లు సమయోచితంగా ఆడ రు. ఆఖర్లో శివం దూబే(27), రింకూ సింగ్(11 నాటౌట్) మెరుపులతో టీమిండియా ప్రత్యర్థికి 176 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.








# వైభవంగా శివ మహోత్సవం

## శ్రీ అరుణాచలేశ్వరుని దివ్య కళ్యాణం వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ

**జనోదయ : డి. హీరేహాళ్ (అనంతపురం) ఫిబ్రవరి 15**

అనంతపురం నగరంలో ఏపీఐఐసీ డైరెక్టర్ చల్లా లక్ష్మీ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన శివమహోత్సవంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎం.ఎస్.రాజు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌లతో కలిసి పాల్గొన్నారు. నగరంలోని శ్రీనగర్ కాలనీలో 10వేల 8వందల శివలింగాలు, రుద్రాక్షలతో మహా అభిషేక కార్యక్రమం వైభవంగా సాగింది. అభిషేక కార్యక్రమంతో పాటు శ్రీ అరుణాచలేశ్వరుని దివ్య కళ్యాణ వేడుకను వారు వీక్షించారు. అత్యంత భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా ఇంత పెద్ద ఆధ్యాత్మిక వేడుకలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఇన్ని వేల మందితో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సాధారణ విషయం కాదన్నారు. ఆధ్యాత్మిక భావం పెంపొందించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన చల్లా లక్ష్మీప్రసాద్ దంపతులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.



# మహాశివరాత్రి సందర్భంగా గంగాధరలో వైభవంగా శివ జాగరణ



**జనోదయ : గంగాధర ఫిబ్రవరి 15:**

గంగాధర మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తి మయ వాతావరణంతో కళకళలాడింది. హరే రామ హరే కృష్ణ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన శివరాత్రి జాగరణ కార్యక్రమం ఘనంగా సాగింది. రాత్రంతా భజనలు, నామస్మరణ, పారాయణాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక స్పందనతో మార్మోగింది.భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి మహాదేవుని స్మరించుకుని వ్రతదీక్షలు చేపట్టిన భక్తులు రాత్రి జాగరణలో పాల్గొని భక్తిశ్రద్ధలతో నామసంకీర్తన చేశారు. శివుని లీలలను స్మరిస్తూ భక్తులు చేసిన కీర్తనలు, హారతులు ఆలయానికి ప్రత్యేక శోభను తెచ్చాయి.కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో హరే రామ హరే కృష్ణ బృందం సభ్యులు కీలక పాత్ర పోషించారు. హరినామ సంకీర్తనలతో భక్తి పారవశ్యంతో నృత్యాలు చేసి భక్తులను అలరించారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా గంగాధరలో భక్తి వాతావరణం నెలకొని ఆధ్యాత్మిక ఉత్సాహం ఉట్టిపడింది.

# సామాజిక న్యాయం కోసం పోరాడిన యోధుడు

## అంబేద్కర్ విగ్రహానికి నివాళులార్పించిన రేచపల్లి సర్పంచ్ బాస మహేష్

**జనోదయ, జగిత్యాల ఫిబ్రవరి 15:**

జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ కార్యవర్గ సభ్యుడు, డిక్కి జిల్లా కోఆర్డినేటర్ నల్ల శ్యామ్ ఆధ్వర్యంలో డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి సారంగాపూర్ మండలంలోని రేచపల్లి గ్రామ సర్పంచ్ బాస మహేష్ పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమ నిర్వాహకుడు నల్ల శ్యామ్ మాట్లాడుతూ.. అంబేద్కర్ దేశానికి అందించిన అమూల్యమైన సేవలు, సమానత్వం, న్యాయం, సామాజిక సంస్కరణలపై ఆయన ఆలోచనలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని తెలుపుతూ, అంబేద్కర్ జీవితం, ఆశయాలను విస్తృతంగా ప్రజలకు చేరవేయాలనే ఉద్దేశంతో ప్రతి ఆదివారం స్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రేచపల్లి గ్రామ సర్పంచ్ బాస మహేష్ మాట్లాడుతూ.. అంబేద్కర్ కేవలం భారత రాజ్యాంగ శిల్పి మాత్రమే కాకుండా సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. "విద్య పొందండి, సంఘటితంగా ఉండండి, పోరాడండి" అనే ఆయన సందేశం నేటికీ సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం విలువలను ఆచరణలో పెట్టి సమాన భారత నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తక్కళ్ళ దేవయ్య, ఆనంతుల కాంతారావు, మేనేని రవీందర్ రావు , మద్రిపల్లి శ్రీనివాస్ , కంటె అంజయ్య ప్రధాన కార్యదర్శి పట్టణ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం, పులి నర్సయ్య ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు సంఘం,సుంకరిపల్లి అశోక్, దాసరి లచ్చయ్య మాజీ సర్పంచ్ సిరికొండ, బొల్లం ప్రభాకర్, సంకె మహేష్,చెనల్ల సుమన్,నల్ల సురేష్,బంద్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.






# నేడు 'పుర'పాలకవర్గాల కొలువు

**11 గంటలకు సభ్యుల ప్రమాణం**
**12:30 గంటలకు మేయర్ చైర్‌పర్సన్లు ..**
**ఆ తర్వాత డిప్యూటీ మేయర్, వైఎస్ చైర్‌పర్సన్ల ఎన్నిక**
**చేతులెత్తే విధానంలో ఎన్నిక**
**పార్టీ అభ్యర్థులకు విప్ జారీ**
**ఎక్స్ అఫీషియో సభ్యులు కీలకం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 15 :** రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో నేడు (సోమవారం) కొత్త పాలకవర్గాలు కొలువుదీరనున్నాయి. ఇందుకు రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ అన్ని ఏర్పాట్లు చేసింది. ఆయా జిల్లాల కలెక్టర్ల పర్యవేక్షణలో ఈ ప్రక్రియను పూర్తిచేసేందుకు రంగం సిద్ధమైంది. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నిక ఫలి తాలు 13న ఫలితాలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు నేడు (సోమవారం) 11 గంటలకు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు, కార్పొరేటర్లతో సంబంధిత కమిషనర్లు ప్రమాణం చేయిస్తారు. అనంతరం చైర్మన్/వైఎస్ చైర్మన్, మేయర్/డిప్యూటీ మేయర్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేస్తారు. కోరం(సగం మంది ఎన్నికైన సభ్యులు)హాజరైతే మధ్యాహ్నం 12:30 గంటలకు చైర్మన్/వైఎస్ చైర్మన్, మేయర్/డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియకు ఉపక్రమిస్తారు. కోరం లేకుంటే ఎన్నికను మరో రోజుకు వాయిదా వేస్తారు. ఎన్నికైన వార్డు సభ్యులు మాత్రమే మేయర్ లేదా చైర్‌పర్సన్ పదవులకు పోటీ చేయడానికి అర్హులు. రిజర్వేషన్లు అమలులో ఉన్నచోట ఆయా క్యాటగిరీల వ్యక్తులు మాత్రమే పోటీ చేయాలి. చేతులెత్తడం ద్వారా ఎన్నిక జరుగనున్నది. మొదట మేయర్ లేదా చైర్‌పర్సన్ ఎన్నిక ఉంటుంది. ఆ తర్వాత డిప్యూటీ మేయర్ లేదా వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక చేపడతారు. ఒకే అభ్యర్థి ఉంటే ఏకగ్రీవంగా ప్రకటిస్తారు. ఒకరి కంటే ఎకువ మంది ఉంటే ఎకువ ఓట్లు వచ్చిన వారిని విజేతగా ప్రకటిస్తారు. ఓట్లు సమానంగా వస్తే లాటరీ ద్వారా విజేతను నిర్ణయిస్తారు. ఆయా పార్టీలు తమ సభ్యులకు నిర్దిష్ట అభ్యర్థికే ఓటు వేయాలని విప్ జారీ చేస్తాయి. ఒకవేళ ఎవరైనా సభ్యుడు పార్టీ విప్ పాటించకుండా వేరే వారికి ఓటు వేస్తే, వారి సభ్యత్వం రద్దవుతుంది. విప్ ఉల్లంఘనపై పార్టీలు మూడు రోజుల్లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలి. కలెక్టర్ వారంలో సదరు సభ్యుడి వివరణ కోరతారు. సరైన సమాధానం ఇవ్వకపోతే సభ్యత్వం రద్దు చేస్తారు. కానీ, వారు వేసిన ఓటు మాత్రం చెల్లుబాటు అవుతుంది.ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఓటు వేసే అధికారం కలిగి ఉంటారు. ప్రస్తుతం ఎక్స్ అఫీషియో సభ్యుల ఓటింగ్ నిబంధనల్లో మార్పులు చేశారు. గతంలో రాజ్యసభ ఎంపీ, ఎమ్మెల్సీలు ఏ మున్సిపాలిటీ లేదా కార్పొరేషన్‌లోనైనా ఓటువేసే అవకాశం ఉండగా, దానిని మార్చి ఆయా మున్సిపాలిటీల పరిధిలోని సభ్యులకే ఓటు వేసే అవకాశం కల్పించారు.



## పీవీ ఎక్స్‌ప్రెస్ వే పై
# భారీ వాహనాల ఎంట్రీ



**చోద్యం చూస్తున్న ట్రాఫిక్ పోలీసులు**

**జనోదయ : రాజేంద్రనగర్**

పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే పై నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతున్న భారీ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు. శనివారం రాత్రి సమయంలో పీవీ ఎక్స్ ప్రెస్ వే పై కర్ణాటక కు చెందిన ఇసుక లారీతో పాటు ట్రావెల్స్ బస్సు, ద్విచక్ర వాహనం యాక్టివా వెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. మెహదీపట్నం నుండి అరాంఘర్ వైపు ఈ వాహనాలు బయలుదేరాయి. అడపాదడపా ఈ ఫ్లైఓవర్ పై కారు ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. మరి భారీ వాహనాల ఎంట్రీతో ప్రమాదాలు ఏ స్థాయిలో ఉంటాయో ఊహించుకోవచ్చు. చిన్న చిన్న వాహనాల ఫోటోలు తీసే ట్రాఫిక్ పోలీసులకు ఈ భారీ వాహనాల ఎంట్రీ కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. హైదరాబాదులోని పీవీ ఎక్స్‌ప్రెస్ వే (మెహిదీపట్నం – ఆరాంఘర్) పై భారీ వాహనాలకు, లారీలకు, ఆటోలకు, ద్విచక్ర వాహనాలకు కఠినమైన నిషేధం ఉంది. ఈ 11.6 కి.మీ ఎత్తైన మార్గం కేవలం తేలికపాటి వాహనాలు, కార్లు శంషాబాద్ విమానాశ్రయానికి వేగంగా వెళ్లడం కోసం రూపొందించబడింది. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు భారీగానే ఉంటాయి. అయినా ఇవి ఏమి పట్టించుకోకుండా కొంతమంది వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తూ ట్రాఫిక్ పోలీసులకు సవాలు విసురుతున్నారు.

